సాక్షి సంగారెడ్డి

బుధవారం । 26 । మార్చి । 2025



...మడి మడికో రకం

పల్లేరులు మొలిచిన చోటే పసిడి పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు హుస్నాబాద్ మండలం తోటపల్లికి చెందిన రైతు...


వివరాలు 8లో ▸



కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం కేసీఆర్ కాలనీలో ఉన్న చెత్తను తొలగించాలని కలెక్టర్ ఆదేశించినా పారిశుద్ధ్య సిబ్బందిలో చలనం లేదు.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

బియ్యం పక్కదారిపై విచారణ



పట్టుబడ్డ బియ్యం లారీ

సాక్షి ఎఫెక్ట్..

నారాయణఖేడ్: 'పేదల బియ్యం పక్కదారి' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు రహస్యంగా విచారణ నిర్వహిస్తున్నారు. ఇంటిలిజెన్స్ సమాచారంతోనే ఈ బియ్యం దాబావద్ద పట్టుబడినట్లు నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి మీడియాకు తెలిపారు. భవిష్యత్తులో బియ్యం పట్టుబడితే తూకం వేసే క్రమంలో పోలీసు కానిస్టేబుల్‌ను తూకంవేసే వరకు ఉండి పరిశీలించి తగు ఫొటోలు తీసుకోవాలని సూచించినట్లు ఆయన వెల్లడించారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్: పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని సబితా ప్రతిభావంతుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పిల్లలకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలన్నారు. వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు జీతం పెంచాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

పటాన్‌చెరు: ఆశ వర్కర్లకు నెలకు రూ.18 వేల జీతం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ సందర్భంగా ఆశ వర్కర్లపై పోలీసుల దౌర్జన్యాలను, వారి అక్రమ అరెస్టులను ప్రతీ ఒక్కరూ ఖండించాలన్నారు. ఆశ వర్కర్ల అక్రమ అరెస్టులకు నిరసనగా మంగళవారం పట్టణంలోని శ్రామిక్ భవన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలలో విజయవంతం కోసం అనేక ఏళ్లుగా ఆశ వర్కర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

27న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరుటౌన్: భవిష్య నిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారంలో భాగంగా ఈ నెల 27న నిధి ఆప్ కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని వెల్‌జాన్ హైడ్రాయిర్ లిమిటెడ్‌లో, జహీరాబాద్ కోహీర్ క్రాస్ రోడ్‌లో పిరమల్ ఫార్మా లిమిటెడ్‌లో, పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సింతోకెం లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లలో భవిష్యనిధి సమస్యలున్న వారు ఈ మూడు కేంద్రాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉపాధిపై ప్రజా వేదిక



ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకంపై ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 2023–24 ఏడాదికి గాను 15 గ్రామాలలో రూ.85 లక్షలు ఖర్చు చేసిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి బాలరాజ్ ప్రిసైడింగ్ అధికారిగా హాజరయ్యారు. 15 గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పనులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, అంబుడ్స్‌మన్ భోజిరెడ్డి, ఎంపీడీవో అరుణారెడ్డి, ఏపీవో రామ్మోహన్, ఈసీ మహేశ్వర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరుగుల జూదం

2016లో ఖేడ్‌లో...

నారాయణఖేడ్‌కు చెందిన ఓ బీటెక్ విద్యార్థి గణేశ్ యాదవ్ 2016లో అప్పులు చేసి మరీ తన స్నేహితులతో కలసి ఐపీఎల్‌లో రూ.ఐదు లక్షలు బెట్టింగ్ వేసి నష్టపోయాడు. అప్పులు తీర్చలేక కొద్దిరోజులకే తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

2019లో సంగారెడ్డిలో...

సంగారెడ్డికి చెందిన ఇంటర్ విద్యార్థి ఉపేంద్ర రాథోడ్ తన జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించేందుకు 2019లో రూ.లక్షల్లో ఐపీఎల్ బెట్టింగ్ కాసి తీవ్రంగా నష్టపోయాడు. బెట్టింగ్‌లో నష్టం వచ్చిందన్న మనో వేదనతో తన గదిలో ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు.

ఐపీఎల్‌లో బెట్టింగ్ వేసి నష్టపోయి ప్రాణాలు పోగొట్టుకున్న వారు వీరిద్దరే కాదు...ఇలా బెట్టింగ్ కాసి కుటుంబాలను రోడ్డు పడేసిన వారు, ప్రాణాలు తీసుకున్నవారు జిల్లా వ్యాప్తంగా చాలామంది ఉన్నారు.

ఐపీఎల్.. బెట్టింగ్‌ల జోరు

- చిత్తవుతున్న యువత
- పోలీసుల ప్రత్యేక నిఘా
- దూరంగా ఉండాలంటున్న నిపుణులు

సంగారెడ్డి టౌన్

ఇటీవల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–18 సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ క్రికెట్ మ్యాచ్‌లను జోరుగా చూస్తున్నారు. అలా చూసి ఆనందిస్తే పర్వాలేదు కానీ.. ఇదే అదునుగా బెట్టింగ్ రాయుళ్లు జనాల బలహీనతలను క్యాష్ చేసుకుంటున్నారు. కోడ్ భాషలో ఈ ఆటపై బెట్టింగ్‌లు నిర్వహించడం, వాటిని కాయడం వంటి చట్టవ్యతిరేక పనులు చేస్తూ ముఖ్యంగా యువత తమ జీవితాలను పాడు చేసుకుంటోంది. ఇన్నాళ్లూ పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ బెట్టింగ్ భూతం ఇప్పుడు పల్లెల్లోకి చొచ్చుకొచ్చేసింది.

హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో భారీ స్క్రీన్లు

హోటళ్లల్లోను, బార్ అండ్ రెస్టారెంట్లలోనూ భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ఐపీఎల్ మ్యాచ్‌లు తిలకిస్తున్నారు. టీ పాయింట్లు, దాబాలలో కూడా మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు వీక్షించడం, బంతి బంతికి, టాస్, ఫోర్లు, సిక్సర్లు ఇలా మొదలు పెట్టి బెట్టింగ్‌లతో హోరెత్తిస్తున్నారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభం నుంచి యువకులు, విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. సులువుగా డబ్బు సంపాదించడానికి యువత ఇంట్లో వస్తువులు, బైకులు తాకట్టు పెడుతున్నారు. వంద రూపాయలు మొదలుకుని వేలు, లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నారు. వంద బెట్టింగ్ గెలిస్తే రూ. వెయ్యి వరకు ఇస్తామన్నట్లు సమాచారం.

ఆన్‌లైన్లు,సెల్‌ఫోన్ ద్వారా....

ఆన్‌లైన్, సెల్‌ఫోన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఇతరులకు అర్థం కాకుండా కోడ్ భాషను ఉపయోగిస్తూ బెట్టింగ్ కాస్తున్నారు. ఏ జట్టుపై బెట్టింగ్ వేస్తారో ఆ జట్టును 'బ్యాక్'కోడ్ పదంతో పిలుస్తారు. అవతలి జట్టును 'లే'కోడ్ పదంతో వ్యవహరిస్తారు. ఇక బెట్టింగ్ రాయుళ్ల బ్యాంక్ ఖాతాలో ఉంచిన డబ్బు ఆన్‌లైన్‌లో చెల్లిస్తూ ఈ బెట్టింగ్ వ్యవహారాన్ని నడుపుతున్నారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని మళ్లీ బెట్టింగ్‌లు కాసేందుకు డబ్బుల్లేక ఇంట్లో ఉన్న వస్తువులు సైతం అమ్మడం, డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించడం వంటివి చేస్తున్నారు. ఇటువంటి సమయంలోనే తల్లిదండ్రులు వీరికి వెంటనే బెట్టింగ్ జోలికి పోకుండా కౌన్సిలింగ్ ఇప్పించాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.



సంగారెడ్డిలోని ఓ హోటల్లో మ్యాచ్ కోసం ఏర్పాటు చేసిన స్క్రీన్

ఎలా జరుగుతుందంటే...

ఆటల్లో బెట్టింగ్ రకరకాలుగా జరుగుతోంది. కొంతమంది తమకు అనువైన రీతిలో బెట్టింగ్ పాల్పడుతుండగా, మరి కొంతమంది గ్రూప్‌గా ఏర్పడి పందెం కాస్తున్నారు. మరికొంతమంది టాస్ గెలిచిన జట్టుపై బెట్టింగ్ కాస్తారు. మ్యాచ్‌లో ఏ జట్టు గెలుస్తుంది? ఆ జట్టు ఎన్ని పరుగులు చేస్తుంది? ఎవరు ఎన్ని పరుగులు చేస్తారు? ఏ బౌలర్ ఎన్ని వికెట్లు తీస్తాడు వంటి అంశాలపై బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇలా ఎక్కువగా యువత ఈ బెట్టింగ్‌లు కాస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా జోగిపేట్, సదాశివపేట, సంగారెడ్డి, అమీన్పూర్, పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్, వట్‌పల్లి ప్రాంతాల్లో యువకులు క్రికెట్ బెట్టింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. కొన్నిసార్లు వస్తురూపంలోనూ పంపకాలు జరుగుతున్నాయి.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



క్రికెట్ బెట్టింగ్‌లో యువత నష్టపోతుంది. క్రీడాస్ఫూర్తిని ఆస్వాదించాలి కానీ విషాదంగా మార్చుకోకూడదు. పల్లెలు, పట్టణాల్లో యువకులకు ఆశ చూపించి వారిని బెట్టింగ్ రాయుళ్లు తప్పుదోవ పట్టిస్తున్నారు. రాత్రికి రాత్రి డబ్బు సంపాదిద్దామనే పద్ధతి సరికాదు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడే వారిని తప్పుదారిలో వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

-పూర్ణ కృష్ణ, మోటివేషనల్ స్పీకర్

మానసిక ప్రశాంతతను కోల్పోతారు



బెట్టింగ్ వేయడంతో మానసిక ప్రశాంతతను కోల్పోతారు. మ్యాచ్ చూస్తున్న సమయంలో బెట్టింగ్ పోతే ఇతరులకు డబ్బులు కట్టాలనే ఆలోచనలతో మానసిక ఆందోళనకు గురవుతుంటారు. ఒక్కోసారి ప్రాణాలు తీసుకుంటుంటారు. కాబట్టి యువతే కాదు ఎవరైనా సరే బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి.

-డాక్టర్ పరశురాం, మానసిక వైద్యులు

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



ఐపీఎల్‌లో బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బెట్టింగ్ ఆడే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. బెట్టింగ్‌లకు అలవాటు పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పల్లెల్లో కూడా పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. బెట్టింగ్ చట్టరీత్యా నేరం. జైలుకు కూడా వెళ్లాల్సి ఉంటుంది.

-పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ

అమీన్పూర్ ఎక్సైజ్ పీఎస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం



అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: అమీన్పూర్ కేంద్రంగా నూతన ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ మంజూరైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం..మంగళవారం ఉదయం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో గల పాత గ్రామ పంచాయతీ భవనాన్ని వివిధ శాఖల అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏప్రిల్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభమవుతాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక ఆస్పత్రి పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న కాయకల్ప బృందం

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తిలోని 30 పడకల సామాజిక ఆస్పత్రిని సికింద్రాబాద్ ఏరియా ఆస్పత్రికి చెందిన కాయకల్ప బృందం మంగళవారం సందర్శించింది. సూపరింటెండెంట్ అనురాధ నేతృత్వంలో నర్సింగ్ ఆఫీసర్ అమూల్య రాణి, డాక్టర్ రాధాకృష్ణ, ప్రవీణ్‌ల బృందం ఆస్పత్రి పరిశుభ్రత, ఇన్‌పేషెంట్లతో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. వారి వెంట డాక్టర్ స్వప్న, డా.జువేరియాబేగం, సూపర్‌వైజర్ గురుస్వామి ఉన్నారు.

● కలెక్టరేట్‌లో ఘనంగా ఇఫ్తార్



చిన్నారికి ఖర్జూర పండు తినిపిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి. చిత్రంలో అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి టీజీటీఏ-టీజీఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపకు ఖర్జూరం తినిపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, టీజీటీఏ అధ్యక్షురాలు షేక్ హసీనా, జనరల్ సెక్రటరీ నజీమ్ ఖాన్, ఏఓ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు. - సంగారెడ్డి జోన్

సన్నబియ్యం సర్దుబాటు

- నిజామాబాద్, కామారెడ్డి, మెదక్ నుంచి తెప్పిస్తున్న అధికారులు
- జిల్లాలో అందుబాటులో లేని సన్నరకం నిల్వలు
- ఏప్రిల్ 1 నుంచి రేషన్‌షాపుల్లో పంపిణీకి ఏర్పాట్లు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సన్న బియ్యం కోసం పౌరసరఫరాల సంస్థ పక్క జిల్లాలపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. తెల్ల రేషన్‌కార్డుదారులకు ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించిన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా అవసరాల కోసం ఈ సన్న బియ్యాన్ని కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి తెప్పిస్తున్నారు. సన్నరకం ధాన్యం సాగు జిల్లాలో నామమాత్రమే. జిన్నారం, గుమ్మడిదల, హత్నూర వంటి మండలాల్లో అతికొద్ది మంది రైతులు మాత్రమే ఈ సన్నరకం ధాన్యాన్ని సాగు చేస్తారు. ఇలా సాగైన ధాన్యాన్ని రైతులు తమ సొంత అవసరాల కోసమే ఎక్కువగా వినియోగిస్తారు. మిగిలిన సన్నధాన్యం ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేస్తారు. దీనికితోడు జిల్లాలో బాయిల్డ్ రైసుమిల్లులు కూడా తక్కువే. ఈ బాయిల్డ్ మిల్లులుంటే మిల్లర్లు ఇతర జిల్లాల నుంచి సన్నరకం ధాన్యాన్ని తెచ్చి సన్నబియ్యంగా మార్చేవారు. కానీ, ఈ పరిస్థితి కూడా జిల్లాలో తక్కువే. దీంతో ఈ సన్నబియ్యం కోసం పక్క జిల్లాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఇప్పటివరకు నిజామాబాద్ జిల్లా నుంచి 1,600 మెట్రిక్ టన్నులు, కామారెడ్డి జిల్లా నుంచి 2,000 మెట్రిక్ టన్నులు, మెదక్ జిల్లా నుంచి 2,318 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం జిల్లాకు చేరాయి.

కార్డుల సంఖ్య పెరిగే అవకాశం

ప్రస్తుతం జిల్లాలో 3.79 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఇటీవల కొత్త రేషన్‌కార్డులను సైతం ప్రభుత్వం జారీ చేసింది. ఈ కొత్త కార్డులపై ఏప్రిల్ నుంచి నిత్యావసరాలు పంపిణీ చేసే అవకాశాలున్నాయి. దీంతో జిల్లాలోని కార్డుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని ఈ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

7,500 మెట్రిక్ టన్నులు..

జిల్లాలో 3.79 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఈ కార్డులపై గత నెలలో 7,899 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. రేషన్ పోర్టబిలిటీ విధానం అందుబాటులోకి వచ్చాక ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వలస వచ్చిన వారు కూడా ఈ బియ్యాన్ని జిల్లాలో తీసుకునేందుకు వీలు కలుగుతోంది. ప్రధానంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు ప్రతినెలా బియ్యాన్ని స్థానిక రేషన్‌షాపుల్లో తీసుకుంటున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహరాష్ట్ర వంటి రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేలల్లో జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. రేషన్ పోర్టబిలిటీ విధానం అందుబాటులోకి వచ్చాక ఈ నిరుపేద కార్మికులు తమ నిత్యవసరాలను ఇక్కడే తీసుకునేందుకు వీలు కలుగుతోంది. దీంతో జిల్లాలో ఉన్న రేషన్‌కార్డుల కంటే ఇతర జిల్లాలు, రాష్ట్రాల రేషన్‌కార్డుదారుల కోసం అదనంగా బియ్యాన్ని కేటాయించాల్సి ఉంటుంది. దీంతో జిల్లా కార్డులకు సరిపడే బియ్యంతోపాటు, పోర్టబిలిటీకి సరిపడా సన్నబియ్యాన్ని అందుబాటులో ఉంచేందుకు పౌరసరఫరాల సంస్థ చర్యలు చేపట్టింది.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

ఈ సన్నబియ్యం పంపిణీ విషయంలో ప్రభుత్వం నుంచి తమకు మౌఖిక ఆదేశాలు తప్ప.. రాతపూర్వకంగా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

- శ్రీనివాస్‌రెడ్డి
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జొన్న మొక్కలకు కట్లు



కట్లు కట్టిన జొన్న పంట

జహీరాబాద్ టౌన్: అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. ఈదురు గాలులు, వడగండ్ల వాన వల్ల జొన్న, మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. చెట్లు కూలిపోయాయి.. కరెంట్ తీగలు తెగిపడ్డాయి. తెల్లజొన్న పంటకు ఎక్కువగా నష్టం జరిగింది. జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో జొన్నపంట సాగువుతోంది. ఈదురుగాలలు వల్ల పంట నేలకొరిగింది. పడిపోయిన పంటను కాపాడుకునేందుకు రైతులు పైకెత్తి కట్లు కడుతున్నారు. పడిపోయిన జొన్నపంటకు ఐదారు మొక్కలు ఒకచోట కలిపి కట్టు కడుతున్నారు. ఇలా చేయడం వల్ల గింజలు దెబ్బతినకుండా ఉంటాయి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దెబ్బతిన్న పంటల వివరాలు సేకరిస్తున్నారు.

మహిళలకు సాగు యంత్రాలు

- లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు
- యంత్రాన్నిబట్టి సబ్సిడీ మంజూరు
- నెలాఖరుకు లబ్ధిదారుల ఎంపిక
- జిల్లాకు రూ.కోటి 31 లక్షల కేటాయింపు



సంగారెడ్డి జోన్: వ్యవసాయ రంగంలో మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వ్యవసాయ యాంత్రీకరణలోభాగంగా మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పరికరాలు మంజూరు చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మహిళా రైతులకు యంత్ర పరికరాలు మంజూరు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఈ నెలాఖరునాటికి లబ్దిదారులను ఎంపిక చేసి, అందించే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వ్యవసాయ రంగంలో యాంత్రీకరణలో భాగంగా తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా రైతులకు వివిధ రకాల యాంత్రాలను అందజేయనుంది. జిల్లాకు 630 యూనిట్లకు రూ.1,31,17,000లను కేటాయించింది.

లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

వ్యవసాయ శాఖ తరపున లబ్దిదారులను గుర్తించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. లబ్దిదారులను ఎంపిక చేసేందుకు జిల్లా స్థాయిలో జిల్లా కమిటీ, మండల స్థాయిలో మండల కమిటీల ద్వారా ఎంపిక చేయనున్నారు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కన్వీనర్‌గా, రీజినల్ మేనేజర్(వ్యవసాయ శాఖ), లీడ్ బ్యాంకు అధికారులు సభ్యులుగా ఉండనున్నారు. మండలస్థాయి కమిటీలో కన్వీనర్ గా మండల వ్యవసాయ శాఖ అధికారి, సభ్యులుగా ఎంపీడీవో, తహసీల్దార్‌లు ఉండనున్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ముమ్మర కసరత్తు

వ్యవసాయ పనిముట్లు అందించేందుకు అర్హులైన వారిని ఈ నెలాఖరునాటికి గుర్తించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నం సాగించారు. జిల్లాలో 630 పరికరాలు సబ్సిడీతో అందించనున్నారు. సుమారు ఏడేళ్ల తర్వాత వ్యవసాయరంగంలో సబ్సిడీపై యంత్ర పరికరాలను పంపిణీ చేయనున్నారు. వివిధ రకాల యంత్రాలను బట్టి సుమారు 50% వరకు అందించనున్నారు.

వివిధ రకాల యంత్ర పరికరాలు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న యంత్ర పరికరాలు వ్యవసాయ పనులకు దోహదపడే విధంగా అందిస్తారు. అందులోభాగంగా రోటోవేటర్, విత్తనాలు, ఎరువులు వేసే పరికరాలు, కల్టివేటర్లు, డ్రోన్లు, పవర్ స్ప్రేయర్లు, కేజ్ వీలర్లు, రోటోపడ్లర్, పవర్ వీడర్, బ్రష్‌కట్టర్స్, పవర్ టిల్లర్, ట్రాక్టర్, హార్వెస్టింగ్ పరికరాలున్నాయి.

మహిళపై సామూహిక అత్యాచారం ?

- భర్త మూత్ర విసర్జనకు వెళ్లగా అఘాయిత్యం
- వివరాల వెల్లడికి పోలీసులు నిరాకరణ

కంది(సంగారెడ్డి): ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలం మామిడిపల్లి చౌరస్తా సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పటాన్‌చెరు మండలం కంజర్ల గ్రామానికి చెందిన దంపతులు తమ ఆటోలో సోమవారం రాత్రి సదాశివపేట మండలం పెద్దపూర్‌లో విందులో పాల్గొని తెల్లవారు జామున ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మామిడిపల్లి చౌరస్తా వద్ద ఆటో ఆపిన భర్త మూత్ర విసర్జనకు వెళ్లాడు. వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. అడ్డొచ్చిన భర్తపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఘటనా స్థలాన్ని ఎస్పీ పంకజ్ పరిశీలించారు. బాధితురాలిని వైద్య పరీక్షలు చేయించి భరోసా సెంటర్‌కు తరలించారు. అయితే.. ఈ కేసు వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. విచారణ పూర్తయ్యాక అన్ని వివరాలు అందిస్తామని చెబుతున్నారు. అయితే.. బాధితులురాలు భిన్న వాదనలు వినిపిస్తుండటంతో పోలీసులు కేసు విషయమై ఒక నిర్ధారణకు రాలేదని తెలిసింది.

మత స్వేచ్ఛను ప్రశ్నిస్తున్న ఉత్తర్వు

జహీరాబాద్: దళితులు క్రైస్తవాన్ని స్వీకరిస్తే ఎస్సీ రిజర్వేషన్ రద్దు చేయడాన్ని కుట్రగానే పరిగణించాలని దళిత్ సాలిడారిటీ మూవ్‌మెంట్(డీఎస్ఎం) వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగొండ విజయరాజు అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లో దళిత క్రైస్తవులపై ఎందుకు వివక్ష అనే పుస్తకంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అణచివేతకు గురైన దళితులను క్రైస్తవ మిషనరీలు అక్కున చేర్చుకున్నాయన్నారు. మతం మారిన దళితులకు ఎస్సీ రిజర్వేషన్ రద్దు చేసే రాష్ట్రపతి ఉత్తర్వు దళిత క్రైస్తవులకు శాపంగా మారిందన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు బెజ్జంకి విద్యార్థి


క్రీడాకారుడు అరవింద్

బెజ్జంకి(సిద్దిపేట): జాతీయ స్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ పోటీలకు బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బొనగిరి అరవింద్ ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ జిల్లా కార్యదర్శి మల్లేశం కుటుంబ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరవింద్ హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి పారామెడికల్ చదువుతున్నాడు. జనవరి 18న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 పోటీల్లో ప్రతిభ కనబరిచిన అరవింద్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. నేటి నుంచి బీహార్‌లోని జెహనాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అరవింద్‌ను రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యులు కనుకయ్య, బెజ్జంకిలోని ఆర్‌వీఎంబీపీ అకాడమీ సభ్యులు రవి, మధు, డీవీరావు అభినందించారు.

ఏఐలో విద్యార్థిని ప్రతిభ

- గూగుల్‌లో రీసెర్చ్ పత్రాలు
- అమెజాన్‌లో సైతం పుస్తక రూపంలో స్థానం


తన్వీర్ సుల్తానా

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మండల కేంద్రానికి చెందిన ఎండీ తన్వీర్ సుల్తానా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్‌లో ప్రతిభ కనబర్చారు. అమెరికాలోని మిస్సోరి విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సుల్తానా పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈ క్రమంలో కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)లో మిషన్ లెర్నింగ్ ఇన్ కంప్యూటర్ నెట్‌వర్క్ అనే అంశంపై రీసెర్చ్ చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన పదవ ఐఈఈఈ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సదస్సులో విద్యార్థిని చేపట్టిన రీసెర్చ్ పత్రాలను పరిశీలించారు. ప్రాముఖ్యత దృష్ట్యా గూగుల్‌లో స్థానం కల్పించినట్లు తెలిపారు. రీసెర్చ్ పత్రాలన్నీ పుస్తక రూపంలో అమెజాన్‌లో సైతం స్థానం పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడి మృతి


పాడె మోసిన మంద కృష్ణ మాదిగ


పాడె మోస్తున్న మంద కృష్ణ మాదిగ

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు నంగునూరు మండలం నర్మేటకు చెందిన గందమల్ల యాదగిరి (40) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎస్సీ వర్గీకరణ కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్న యాదగిరి జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన మంద కృష్ణ మాదిగ యాదగిరిని మెదక్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మందకృష్ణ మాదిగ యాదగిరి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా నివాళులర్పించి డప్పు కొట్టి పాడె మోస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. యాదగిరి పెద్ద కూతురు శ్రీచందన నర్మేట ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ ప్రస్తుతం పరీక్షలు రాస్తోంది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పొలం ఎకరం.. మడిమడికో రకం

పల్లేరులు మొలిచిన చోట పసిడి పంటలు


తోటలోని క్యాబేజీని చూపిస్తున్న వెంకటరావు

- బంతి పూలు, స్వీట్‌కార్న్, కూరగాయలు సాగు
- ఏడు పదుల వయస్సులోనూ వ్యవసాయం
- ఆదర్శంగా నిలుస్తున్న తోటపల్లి గ్రామానికి చెందిన మంతెన వెంకటరావు

హుస్నాబాద్‌రూరల్: పల్లేరులు మొలిచే దుబ్బ నేల కరువు నీళ్లకు ఏం ఎవుసం చేసినా ఏ పంటలు పడుతాయి, రూ.లక్షలు పెట్టి బోరువేసినా కొద్దిపాటి నీరే వచ్చే, ఏ పంట వేసినా చేతికి వచ్చే వరకు బోరు నీరు పోస్తదా..? అనే సందేహం ఆ ఏడు పదుల రైతును ఆలోచింపజేసింది. బాటన పోయేవారు ఏలెత్తి చూపి గీ.. నీళ్లకు ఏం ఎవుసం చేత్తవ్ అనే వాళ్లే తప్ప ప్రోత్సహించే వారు లేరు. రైతుకు తన మదిలో మెదిలే ఆలోచనలను ఒక్కొక్కటి అమలు చేసి ఎకరం భూమిలో 20 రకాల పంటలను సాగు చేసి పల్లేరులు మొలసిన చోటనే పసిడి పంటలు పండించి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు ఏడు పదుల రైతు వెంకటరావు..

హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన మంతెన వెంకటరావు డిగ్రీ పూర్తి చేసినా ఉద్యోగం రాకపోవడంతో వ్యాపారంలోకి దిగాడు. హుస్నాబాద్ పట్టణంలో స్థిరపడ్డ వెంకటరావు వ్యవసాయ అవసరాలైన పైపులు, మోటార్ల వ్యాపారం మొదలు పెట్టాడు. ఊరిలో అమ్మానాన్న ఇచ్చిన వ్యవసాయ భూమి వైపు కన్నెతి చూడలేదు. పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో ఒక బిడ్డ హైదరాబాద్‌లో వైద్యురాలిగా సేవలందిస్తుంది. వృద్ధాప్యం రావడంతో వ్యాపారం బంద్ చేసి దుకాణంను వేరొకరికి లీజుకు ఇచ్చాడు.

రూ.1.50 లక్షలతో బోరు

పుట్టిన ఊరిలో అమ్మానాన్న ఇచ్చిన ఎకరం వ్యవసాయ భూమిలో ఏదైనా సాగు చేయాలనే ఆలోచన తట్టగానే రూ.1.50 లక్షలతో బోరు వేయించాడు. బోరు నుంచి వచ్చే కొద్దిపాటి నీటితో పంటలు పండించడం కష్టమే అయినా స్వల్పకాలిక పంటలు సాగు చేయాలని నిర్ణయించాడు. వేరుశనగ, బంతి పూలు, మిరప, స్వీట్ కార్న్, బెండ, సోర, వంకాయ, క్యాబేజీ, బీర, కోతి మీర, చిక్కుడు, టమాట కూరగాయలు సాగు చేస్తున్నాడు. స్వల్పకాలిక పంటలు కావడంతో కష్టానికి ఫలితం వస్తుందని రైతు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. పల్లేరులు మొలిచిన చోటనే రైతు ఆలోచనతో పసిడి పంటలు తీసి పల్లె రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.


మిరప తోటలో రైతు

నీరు చూసి పంటలు వేయాలి

బోరు వేసినప్పుడు కొద్దిపాటి నీరే వచ్చింది. ఈ నీళ్లతో ఏ పంటలు పండుతాయని అందరూ అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం వల్ల తక్కువ కాలంలో లాభాలను పొందవచ్చని ఆలోచన వచ్చింది. స్వీట్‌కార్న్, వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయలు, మిరప వీటికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. మూడు గుంటల బంతి పూలు పెడితే రూ.20 వేలు వచ్చినయ్, మిర్చి మూడు నెలల నుంచి కాస్తనే ఉంది. సాగుకు పని చేయదు అన్న భూమిలోనే రకరకాల పంటలు వేస్తున్నాను. మన చేళ్లలో పండిన కాయలు, పంటలు మన ఇంట్లో అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.

– మంతెన వెంకటరావు, కిషన్‌నగర్


రైతు సాగు చేసిన కూరగాయలు, స్వీట్‌కార్న్ పంటలు

'నవోదయ' ఫలితాలు విడుదల

- ఆరో తరగతిలో ప్రవేశాలు
- తొమ్మిదో తరగతి ఖాళీ సీట్ల భర్తీ ఫలితాలు కూడా..
- వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ రాజేందర్


వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): 2025–26 విద్యాసంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయం ఆరో తరగతిలో ప్రవేశం కోసం జనవరి 18న నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయని వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఫలితాల వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత పొందిన అభ్యర్థులకు సమాచారం చేర వేశామని, హాల్ టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలను నవోదయ విద్యాలయ సమితికి చెందిన హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీ.ఇన్/సీబీఎస్ఈ/2025/ఎన్‌వీఎస్–ఆర్ఈఎస్‌యూఎల్‌టీ/రిజల్ట్.ఏఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి ఫలితాలు చూసుకోవచ్చన్నారు. అర్హత పొందిన 80 మంది అభ్యర్థులకు ఫోన్ ద్వారా, పోస్టు ద్వారా సమాచారం చేర వేస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచారం కోసం 94489 01318 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

తొమ్మిదో తరగతి ఫలితాలు

నవోదయలో తొమ్మిదో తరగతి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఫిబ్రవరి 8న నిర్వహించిన ఎంట్రెన్స్ పరీక్ష (లేటరల్ ఎంట్రీ) ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్ వివరాలు నమోదు చేసి ఫలితాలను నవోదయ విద్యాలయ సమితికి చెందిన హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీ.ఇన్/సీబీఎస్ఈ/2025/ఎన్‌వీఎస్–ఆర్ఈఎస్‌యూఎల్‌టీ/ఆర్ఈఎస్‌సీఎల్ఎస్ఐఎక్స్.ఏఎస్‌పీఎక్స్ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు.

వందేళ్ల చరిత్ర గల పార్టీ సీపీఐ


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

- జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి
- చేర్యాలలో శతవసంత ర్యాలీ, బహిరంగ సభ

చేర్యాల(సిద్దిపేట): వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, పార్టీ నిర్మాణానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ శతవసంత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తా నుంచి అంగడిబజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీ ఖానాలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం అణగారిన వర్గాల ఆశయాల సాధనకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. 100 ఏళ్ల పోరాటాలు, త్యాగాలు వంటి గొప్ప చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. అనంతరం రాష్ట్ర నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, జనగామ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు దయానంద రెడ్డి, సత్యనారాయణ, వనేష్, లక్ష్మణ్, శంకర్, జనార్దన్, భూమయ్య, బాలుమోహన్, పద్మ, నరేశ్, రజిని, మమత, మహేందర్, కృష్ణ, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్, ప్రేమ్, బాల్‌రెడ్డి, భాస్కర్, బన్సిలాల్, సత్తయ్య, నర్సింహచారి, అశోక్, కనకయ్య, శ్రీకాంత్, సురేందర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బడులు పరిపూర్ణ వికాస కేంద్రాలు

- డీఈవో రాధాకిషన్ రావు
- పొడిచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలు పరిపూర్ణ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ రావు అన్నారు. మంగళవారం సాయంత్రం పొడిచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన వార్షికోత్సవానికి అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడి లేకుండా, ఆట పాటలతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఈ రోజు ఉన్నత పదవుల్లో ఉన్నవారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశభక్తి, విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వార్షికోత్సవ వేడుకలు చూస్తుంటే, తమ చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రతాప్ రెడ్డి, నీలకంఠం, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, సుదర్శణమూర్తి, నవీన్, రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మలికార్జున స్వామి ఆలయంలో ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం షాపింగ్ కాంప్లెక్స్ నందు గల షాపులకు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 షాపులకు ఒక్కోదానికి ఏడాదికి రూ.87,600, 6 షాపులు ఏడాదికి రూ. 1,23,600 చొప్పున పలువురు పాటపాడి దక్కించుకున్నారు. టెండర్ కోసం 23 వరకు జారీ చేయాల్సి ఉండగా ఆలయ అధికారులు 24న కూడా జారీ చేయడంతో టెండర్ సమయంలో ఆలయ ఈఓతో టెండర్ దారులు వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆలయ ఈవో రామాంజనేయులు ను వివరణ కోరగా నిబంధనల ప్రకారమే టెండర్ నిర్వహించినట్లు తెలిపారు.

ఆదాయం రూ.76.13లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి వారానికి సంబంధించిన ఆదాయం రూ.76,13,190 వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. మొత్తం మూడు రోజులలో వివిధ రకాల మొక్కుబడులు, దర్శనాలు, ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: దొంగతనం కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం పాత బస్టాండ్ శివార్‌లోని ఓ ఫంక్షన్ హాల్ బయట వృద్ధురాలు ఆటో కోసం నిల్చోగ ఇద్దరు వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీకి యత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా నిందితులను గుర్తుంచారు. పట్టణానికి చెందిన లాల్‌బహదూర్ నగర్‌కు చెందిన షేక్ జావీద్, మహ్మమద్ యాదుల్‌ని మంగళవారం అరెస్ట్ చేసి విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నాం. నిందితులని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్ తెలిపారు.

పీపీఈ కిట్లు ధరించి పనులు చేయాలి


పొలంపల్లి గ్రామాన్ని సందర్శించిన సింజెంటా గ్లోబల్ టీమ్ సభ్యులు

పొలంపల్లి గ్రామ రైతులతో సింజెంటా ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): పొలం పనులు చేసే సమయాల్లో కొన్ని సందర్భాల్లో పీపీఈ కిట్లు ధరించాలని సింజెంటా సీడ్స్ మేనేజర్ సత్తిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పొలంపల్లి గ్రామాన్ని సింజెంటా గ్లోబల్ టీమ్ సభ్యులు సందర్శించి రైతులకు సూచనలు చేసారు. మేనేజర్ మాట్లాడుతూ.. రైతులు సస్యరక్షణ చర్యల సమయంలో భద్రత కోసం ప్రత్యేక కిట్లు ధరించాలని తెలిపారు. అనంతరం సింజెంటా టీమ్ సభ్యులు రైతులతో మాట్లాడి వ్యవసాయం గ్రామంలో జరుగుతున్న వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సాయంగా గ్రామంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని సింజెంటా ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు సింజెంటా ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి


సాయివ్వ(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు దాటుతున్న మహిళను బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్టేషన్ మాసాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం కొట్టాల గ్రామానికి చెందిన బోదాసు సాయవ్వ(43) కామారెడ్డి నుంచి రైలులో స్టేషన్ మాసాయిపేటకు చేరుకుంది. రైలు దిగి తూప్రాన్ వెళ్లడానికి జాతీయ రహదారిపైకి వచ్చి రోడ్డు దాటుతుండగా చేగుంట వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి అన్న సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ కూలీ


చాంద్ బీ(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ చాంద్ బీ(55) మంగళవారం ఉదయం కూలీ పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా ఆకస్మాతుగా కింద పడిపోయింది. అక్కడికక్కడే మృతి చెందడంతో విషయాన్ని తోటి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపీడీఓ సుధాకర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు బావిలో పడి గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండల పరిధిలోని ముస్త్యాల గ్రామానికి చెందిన చిగురు రాజయ్య(68) ఈనెల 18న వ్యవసాయ బావిలో మోటారు బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

దొంగల బీభత్సం

- రెండు వేర్వేరు ఇళ్లలో చోరీ
- బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

సిద్దిపేటకమాన్: రెండు వేర్వేరు తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. గజ్వేల్ ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన అన్నాదమ్ముళ్లు గొడుగు భూపాల్, దేవరాజు కుటుంబాలు తొమ్మిదేళ్ల కిందట వలసొచ్చి పట్టణంలోని శంకర్‌నగర్‌లో ఉమ్మడి కుటుంబంగా నివాసం ఉంటున్నారు. 13న తల్లి సుగుణ మృతిచెందడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లో దాచిన 17.5 గ్రాముల బంగారం, 1120 గ్రాముల వెండి వస్తువులు, రూ. 20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై బాధితుడు భూపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటి తాళం పగులగొట్టి

మరో ఘటనలో పట్టణంలోని శంకర్‌నగర్‌లో తలారీ సాయికుమార్ తల్లి లక్ష్మీతో కలిసి నివాసం ఉంటున్నారు. 22న లక్ష్మీ ఉద్యోగ నిమిత్తం గట్లమల్యాల పీహెచ్‌సీకి విధులకు వెళ్లింది. సాయికుమార్ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఊరెళ్లారు. తిరిగి సోమవారం సాయంత్రం ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా గళ్లపెట్టె పగులగొట్టి రూ.15 వేల నగదు, 2.5 గ్రాముల బంగారు చెవి కమ్మలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై సాయికుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో హుండీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌లోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు హుండీ సొమ్ము చోరీ చేశారు. ఆలయానికి వేసిన తాళాన్ని ఇనుప బ్లేడ్‌తో కోసి హుండీని ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ అధ్యక్షుడు కత్తి రవి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువరిపై కేసు నమోదు చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందింది. దీంతో దాడి చేసి రూ.1,500 స్వాధీనం చేసుకొని, అక్రమంగా పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో పది మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.13,500 జరిమానా, వారిలో ఒక్కరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

రెండవ పంటలో యాజమాన్య పద్ధతులు

- మెలకువలతో అధిక దిగుబడులు
- చెరకు చెత్తతో పంటకు లాభం
- జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి



జహీరాబాద్ టౌన్: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల చెరకు రెండవ పంట నుంచి అధిక దిగుబడులు సాధించవచ్చు. మోడెం తోటల విషయంలో రైతులు శ్రద్ధ చూపకపోవడం మూలంగా దిగుబడులు పడి పోతున్నాయి. రెండో పంటలో రైతులకు పెట్టుబడి ఖర్చు తక్కువ. యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా ఫస్ట్ క్రాప్ కంటే రెండో పంటలో అధిక దిగుబడులను సాధించని వ్యవసాయ శాఖ జహీరాబాద్ డివిజన్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. నాణ్యమైన దిగుబడులు పొందాలంటే సమయానుకూలంగా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు.

జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు పంట సాగుకు అనుకూలం. సుమారు 10 వేల మంది రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో ప్రతీ సంవత్సరం సాగు చేస్తుంటారు. జహీరాబాద్‌తోపాటు జిల్లాలోని సంగారెడ్డి, నారాయణఖేడ్ తదితర నియోజకవర్గాల్లో కూడా రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ఫస్ట్ క్రాప్ (మొక్కతోటలు) నరికిన తర్వాత రెండో పంటను మోడం అంటారు. ప్రస్తుతం చెరకు సీజన్ ముగియడంతో రైతులు రెండో పంట సాగుపై దృష్టి పెట్టారు.

యాజమాన్య పద్ధతులు

- చెరకు పంటను నరికిన వెంటనే మోడులను భూమికి సమాంతరంగా నరికి వేయాలి. పిలకలు భూమి లోపల నుంచి వచ్చి బలీయంగా ఎదిగి వస్తాయి. అధికంగా పిలకలు వచ్చి పంట దిగుబడులు పెరిగేందుకు దోహదపడుతుంది.
- చెత్తను కాల్చి వేయకుండా ఆకులు కుళ్లినట్లు చేస్తే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఇలా చేయడం ద్వారా ఎకరానికి 3 నుంచి 4 టన్నుల మేర సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది.


జహీరాబాద్‌లో సాగవుతున్న చెరకు పంట

- తోట నరికిన వెంటనే నీటి తడులు ఇచ్చిన తర్వాత అదును చూసుకొని బొదెను నాగిలితో రెండు పక్కల దున్నాలి. ఇలా దున్నిన సాళ్లలో యూరియా రెండు బస్తాలు, ఎస్ఎస్‌పీ నాలుగు బస్తాలు, ఎంఓపీ ఒక బస్తా వంతున కలిపి వేయాలి. తర్వాత పక్కన నాగలితో దున్నినట్లయితే ఎరువు పూర్తిగా కప్పబడి చెరకు పంట ఏపుగా పెరుగుతుంది.
- బోదెను చీల్చడం ద్వార పాత వేరు తెగి కొత్త వేర్లు అభివృద్ధి చెందుతాయి. ఈ కొత్త వేర్లు చురుకుగా ఉండి భూమిలోని పోషకాలను, నీటిని, గాలిని గ్రహించి వాటికి శక్తి పెరుగుతుంది.
- తోటలో దున్నడం ద్వారా వేర్లకు కావాల్సిన గాలి అంది మొక్క వృద్ధి చెందడంతోపాటు పిలకలు అధికంగా వచ్చే అవకాశముంది.
- మోడెంలో మొక్కలకు మొక్కలకు మధ్య రెండు నుంచి మూడు అడుగుల ఖాళీలు ఉన్నట్లయితే నింపడం వల్ల పంట నాణ్యత పెరుగుతుంది.
- మోడెం తోటలలో రైతులు బోదెలను దున్నిన వెంటనే మట్టిని మోదులపైకి ఎగ దోస్తున్నారు. దీని వల్ల పిలకల శాతం గణనీయంగా తగ్గి పంట దిగుబడులు పడి పోయే ప్రమాదముంది. మోడులపైకి రెండు నెలల వరకు మట్టిని ఎగతీయకుండా చూడాలి. రెండో పంటలో ఫస్ట్ క్రాంప్ తోట కంటే ఒకటిన్నర శాతం ఎక్కువ నత్రజని వాడాలి. ఇలా యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరుగుతుందని ఏడీఏ వివరించారు.